క్లుప్తంగా

మత్స్యకారులను ఆదుకోవాలి

సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్



వేడుకల్లో సంఘం నాయకులు

తుర్కయంజాల్: మత్స్యకారుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఇంజాపూర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. సంఘం 3వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఇంజాపూర్‌లో సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు రామదాసు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, కోశాధికారి జగన్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గోదా శ్రీనివాస్, సభ్యులు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి లంగిడి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు జాతీయస్థాయి లంగిడి పోటీలకు ఎంపికయ్యారు. మహారాష్ట్రలోని థాణెలో జరిగే జాతీయస్థాయి లంగిడి పోటీల్లో స్పందన, స్వాతి, శివాని, విజయ ఎంపికైనట్లు పాఠశాల పీడీ సుశీల తెలిపారు.

నిరుపేదలకు అండగా రాధాకృష్ణ ట్రస్టు

చైర్మన్ దశరథ్‌నాయక్

కడ్తాల్: నిరుపేదలకు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉంటుందని ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలో ఇటీవల మృతి చెందిన సాలార్‌పూర్ గ్రామానికి జేమ్లా, హరియా కుటుంబాలను, న్యామతాపూర్ గ్రామానికి చెందిన కృష్ణయ్య కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించారు. బాధిత కుటుంబాలకు రూ.5వేల చొప్పున.. మూడు కుటుంబాలకు రూ.15వేలు ఆర్థికసాయం అందించారు. అదే విధంగా అనారోగ్యంతో బాధపడుతున్న మండల కేంద్రానికి చెందిన లింగయ్యకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5వేల ఆర్థికసాయం అందించారు. వైస్ ఎంపీపీ ఆనంద్, రైతుబంధు కోఆర్డినేటర్ వీరయ్య, రైతుబంధు జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, ప్రియా రమేశ్, నాయకులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండాకు చెందిన నాజీ అనారోగ్యంతో బుధవారం ఉదయం మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని బీజేపీ గిరిజన మోర్చా జిల్లా నాయకుడు సాయిలాల్ నాయక్ పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందించారు. పరామర్శించిన వారిలో మాన్యనాయక్, నరేందర్, రెడ్యానాయక్, మల్లేశ్ ఉన్నారు.

రూ.5వేలు అందజేత..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన ఉలిగొండ చంద్రయ్య ఇటీవల మృతిచెందాడు. మృతుడి కుటుంబాన్ని బుధవారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. మృతుడి భార్యకు రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కేశవులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ జంగయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు, నాయకులు పాల్గొన్నారు.

బరిలో 24 మంది అభ్యర్థులు

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం బరిలో 24 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మొత్తం 28 మంది అభ్యర్థులు 52 సెట్ల నామినేషన్లను దాఖలు చేయగా ఇందులో ఎర్రం యాదమ్మ నామినేషన్ సక్రమంగా లేకపోవడంతో తిరస్కరించారు. మొత్తం 27 మంది అభ్యర్థులు బరిలో ఉండగా నామినేషన్ల ఉపసంహరణకు చివరిరోజు అయిన బుధవారం కానుగుల జంగయ్య, కట్టజంగయ్య, పి.ఆంజనేయులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో ప్రస్తుతం కల్వకుర్తి బరిలో మొత్తం 24 మంది అభ్యర్థులు ఉన్నట్లు ఎన్నికల అధికారి శ్రీను ప్రకటించారు. కల్వకుర్తిలో ఆచారి(బీజేపీ), కసిరెడ్డి నారాయణరెడ్డి(కాంగ్రెస్), శ్రీనివాసులు(బీఎస్‌పీ), జైపాల్‌యాదవ్(బీఆర్‌ఎస్), అమర్‌నాథ్, శ్రీను, చంద్రస్వామి, రాంచందర్, తిరుపతమ్మ, కిరణ్‌కుమార్, శేఖర్, పాండురంగయ్య, రాజుగౌడ్, బూర్య, పద్మ, వినయ్, రమేశ్, అహ్మద్ అలీ, ఆంజనేయులు, కుమార్, రవి, రేక్య, సుభాష్, హన్మదాస్ బరిలో ఉన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 23, వంకాయ 15, బెండ 28, పచ్చిమిర్చి 35, కాకర 23, బీర 23, క్యాబేజీ 15, ఫ్రెంచిబీన్స్ 65, క్యారెట్ 45, దొండ 18, చిక్కుడు 35–55, గోకర 35, బీట్‌రూట్ 25, క్యాప్సికం 45, ఉల్లిగడ్డ 40, చామగడ్డ 37. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నిలువ నీడ కరువు



కడ్తాల్ ప్రధాన రోడ్డుపైనే ప్రయాణికులను ఎక్కించుకుంటున్న ఆర్టీసీ బస్సు

- కడ్తాల్‌లో బస్టాండ్ లేక ప్రయాణికుల అవస్థలు
- రోడ్డుపైనే ఆర్టీసీ బస్సులు నిలుపుతున్న వైనం
- తరుచూ ట్రాఫిక్ జామ్
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

కడ్తాల్: కడ్తాల్ మండల కేంద్రంలో ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం ఏర్పాటు కలగానే మిగిలింది. దీనికి తోడు బస్‌షెల్టర్లు ఒకచోట బస్సులు మరోచోట నిలుపుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వివరాలు.. కడ్తాల్ ప్రధాన రహదారిపై గతంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిన్న బస్‌షెల్టర్ ఉండేది. అందులో పది నుంచి పదిహేను మంది ప్రయాణికులు వేచి ఉండేందుకు స్థలం ఉండేది. ఆరు సంవత్సరాల క్రితం గ్రామంలో రోడ్డు వెడల్పు పనులు చేపట్టడంతో ఆ బస్ షెల్టర్‌ను కూల్చివేశారు. దాని స్థానంలో రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్ బస్సులు నిలపని రెండు ప్రదేశాల్లో రెండు బస్‌షెల్టర్లు నిర్మించాడు. అయితే అక్కడ ఆర్టీసీ వారు బస్సులు నిలుపడం లేదు. దీంతో షెల్టర్లు ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. కడ్తాల్ ప్రాంతం వాణిజ్య, వ్యాపారపరంగా ఎంతో అభివృద్ధి చెందుతున్నా ప్రయాణికులకు మాత్రం నిలువనీడ మాత్రం కరువైంది. బస్సులు నిలపని చోట షెల్టర్లు నిర్మించడంతో ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు షెల్టర్ల వద్ద నిలబడితే, బస్సులు మరోచోట ఆపుతుండటంతో వారికి ఉరుకులపరుగుల కష్టాలు తప్పడం లేదు.

షెల్టర్ల దగ్గర ఆగని బస్సులు

గతంలో రోడ్డు విస్తరణ చేపట్టకముందు కనీసం బస్సుల కోసం వేచి ఉండటానికి ప్రధాన రహదారిపై చెట్లైనా ఉండేవి. రోడ్డు విస్తరణ పనులతో గ్రామంలో నిలువ నీడ కరువై.. ఎండకు, వానకు, దుమ్ముకు ధూళికి బస్సుల కోసం నిలబడాల్సిన దుస్థితి నెలకొంది. ప్రధాన రహదారిపై రోడ్డు విస్తరణలో భాగంగా గ్రామంలో రెండు కిలోమీటర్ల మేరకు 4 లేన్ల రహదారిగా విస్తరించారు. విస్తర్ణలో భాగంగా గతంలో ఉన్న షెల్టర్ కూల్చి, వేరోచోట మరో రెండు షెల్టర్‌లు నిర్మించారు. గతంలో బస్సులు నిలిపే ప్రదేశంలో బస్‌షెల్టర్ ఉండేది. ప్రస్తుతం ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్ వద్ద బస్సులు, నిలపకపోవడంతో బస్‌షెల్టర్‌లు ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. ప్రధాన రహదారిపై గుక్కెడు నీళ్లు కూడా కరువే. గ్రామ పంచాయతీ వారు ఎలాంటి నీటివసతి ఏర్పాటు చేయకపోవడంతో దుకణాల్లో వాటర్ బాటిల్స్ కొనుక్కొని దాహం తీర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

నిత్యం రద్దీగా..

మండల కేంద్రం మీదుగా నిత్యం వందలాది బస్సులు తిరుగుతుండటంతో రహదారి నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. ప్రైవేట్ వాహనాలు కూడా రోడ్డుపైనే ఆపి ప్రయాణికులను చేరవేస్తుండటంతో తరుచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో బస్సుల కోసం ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు గంటల తరబడి రోడ్డు పక్కన నిలబడవలసిందే. ఇప్పటికైన వేగంగా అభివృద్ధి చెందుతున్న మండల కేంద్రంలో అధునాతన బస్టాండ్ ఏర్పాటుకు ప్రజాప్రతినిధులతో పాటు, అధికారులు దృష్టి సారించాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా షెల్టర్లు



మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ల వద్ద బస్సులు నిలపడంలేదు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. పెరిగిన వాహనాలకు అనుగుణంగా మండల కేంద్రంలో రోడ్డు విస్తరణతో పాటు అధునాతన బస్టాండ్ ఏర్పాటు చేయాలి. ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ దిశగా దృష్టిసారించాలి.

– శివ, కడ్తాల్

బస్టాండ్ ఏర్పాటు చేయాలి



వేగంగా అభివృద్ధి చెందుతున్న కడ్తాల్ మీదుగా వందలాది బస్సు సర్వీసులు తిరుగుతున్నా కనీస సౌకర్యాలు కరువయ్యాయి. అక్కరకురాని చోట బస్‌షెల్టర్లు నిర్మించిన అధికారులు.. ప్రయాణికుల ఇబ్బందులు వెంటనే గుర్తించాలి. ప్రయాణికులు అవసరాల దృష్ట్యా మండల కేంద్రంలో అధునాతన బస్టాండ్ ఏర్పాటు చేయాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ, కడ్తాల్



విద్యార్థులతో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి

- సీబీఐ మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ

హయత్‌నగర్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని ఆ దిశగా కష్టపడాలని సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన 'వ్యక్తిత్వ వికాసం' అనే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాలు, జల్సాల జోలికి పోరాదని సూచించారు. ఆడపిల్లలు సామాజిక మాధ్యమాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. చదువుతో పాటు సంస్కారం నేర్చుకోవాలని తల్లిదండ్రులు, గురువులు, పెద్దలపై గౌరవంతో ఉండాలన్నారు. నూతనంగా ఓటు హక్కును పొందిన విద్యార్థులు సరైన అభ్యర్థిని ఎంచుకోలని సూచించారు. ఓటు ప్రతి పౌరుడి ఆయుధం అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్న ప్రభ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి చింతల రాకేష్ భవానీ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్, డాక్టర్ జాహెదాబేగం, ఉపేంద్ర, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పట్నం' బరిలో 28 మంది అభ్యర్థులు

ఇబ్రహీంపట్నం: నామినేషన్ల ఉపసంహరణ గడువు బుధవారంతో ముగిసింది. ఇబ్రహీంపట్నం అసెంబ్లీ స్థానం నుంచి 39 మంది అభ్యర్థులు 58 సెట్ల నామినేషన్ల వేయగా అందులో నాలుగు తిరస్కరణకు గురైన సంగతి తెలిసిందే. 35 మంది అభ్యర్థుల్లో ఏడుగురు అభ్యర్థులు మంగళ, బుధవారాల్లో నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో 28 మంది ఎన్నికల బరిలో నిలిచారు. నామినేషన్లు ఉపసంహరించుకున్న వారిలో టీపీసీఐ అభ్యర్థి మాధవరెడ్డి, స్వతంత్ర అభ్యర్థులు కార్తీక్ కుమార్, మహేందర్, పద్మనాయక్, రాంరెడ్డి, చిక్కుడు, డబ్బీకార్ శ్రీనివాస్ ఉన్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి తెలిపారు. బరిలో ఉన్న 28 మంది అభ్యర్థుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గొరిగే మల్లేష్ (బీఎస్పీ), నోముల దయానంద్ (బీజేపీ), పగడాల యాదయ్య (సీపీఐఎం), మల్‌రెడ్డి రంగారెడ్డి (కాంగ్రెస్), మంచిరెడ్డి కిషన్‌రెడ్డి(బీఆర్‌ఎస్), అమిరెడ్డి సందీప్‌రెడ్డి (విద్యార్థుల రాజకీయ పార్టీ), కే.కిషన్‌రెడ్డి(ఏడీఆర్‌పీ), గొసుకొండ పృథ్వీరాజ్(టీఆర్పీ), చీమల కళావతియాదవ్(బీసీవైపీ), జయంత్ ప్రసాద్ నాయుడు (నవరంగ్ కాంగ్రెస్ పార్టీ), తులసిగారి రవీందర్(ధర్మసమాజ్ పార్టీ), ప్రతాప్ సింహరాయిడు (తెలంగాణ జాగీర్ పార్టీ), బచ్చిగాళ్ల సైదులు(ప్రజా వెలుగు పార్టీ), యంపల్ల సుధాకర్‌రెడ్డి(యుగ తులసి పార్టీ), వి.సదానందరెడ్డి (పీపుల్ ప్రొటెక్షన్ పార్టీ), సయ్యద్ సిద్ఖులా హుస్సేనీ (ఇండియా ప్రజాబంధు పార్టీ), స్వతంత్ర అభ్యర్థులుగా కొత్త శంకర్‌రెడ్డి, బాలచందర్, పరీక్షిత్‌రెడ్డి, శివ, రవి, రాజ్యలక్ష్మి, మురళి, రవీందర్‌రెడ్డి, సాయికిరణ్, నరేందర్‌రెడ్డి, దేవరాం, వెంకట్‌రాంరెడ్డి తుది ఎన్నికల బరిలో ఉన్నారు. కాగా ఎన్నికల గుర్తుల కేటాయింపు కోసం ఎలక్షన్ కమిషన్ అనుమతికి జాబితాను పంపినట్లు ఆర్ఓ తెలిపారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

- బీఆర్‌ఎస్ ఇబ్రహీంపట్నం అభ్యర్థి కిషన్‌రెడ్డి



గజమాలతో మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ నేతలు

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్‌ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఆ పార్టీ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సూచించారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. కప్పపహాడ్‌లో భారీ గజమాలతో నేతలు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు సంక్షేమ ఫలాలు మళ్లీ అందాలంటే మరోమారు బీఆర్‌ఎస్ ప్రభుత్వం రావాలన్నారు. కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, ఎంపీపీ కృపేశ్, వైస్ ఎంపీపీ మంచిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్‌లు అశోకవర్ధన్‌రెడ్డి, బూడిద రాంరెడ్డి, యాదగిరి, హంసమ్మ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బుగ్గరాములు, భరత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మునీర్, శ్రీనివాస్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు .

మంచిరెడ్డిని గెలిపించండి..

మంచాల: ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యేగా మరోసారి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని గెలిపించాలని బీఆర్‌ఎస్ యువనేత ప్రశాంత్‌కుమార్‌రెడ్డి సతీమణి మంచిరెడ్డి మౌనికారెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బుధవారం మంచాలలో ఎంపీపీ నర్మద, మాజీ ఎంపీపీ ఇందిర, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పావనితో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. గత మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా కిషన్‌రెడ్డి ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. ఏ ఆపద వచ్చినా ప్రజలకు అండగా నిలిచే వ్యక్తి కిషన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో మరింత అభివృద్ధి జరగాలంటే కారు గుర్తుపై ఓటు వేసి మంచిరెడ్డిని గెలిపించుకుందామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బూత్‌ల కోసం బీఆర్‌ఎస్ నేతల గొడవ

దిల్‌సుఖ్‌నగర్: బూత్‌ల కోసం బీఆర్‌ఎస్ నాయకులు గొడవకు దిగారు. ఒకరినొకరు బూతులు తిట్టుకుంటూ పరస్పరం దాడి చేసుకున్నారు. వివరాలు... ఆర్‌కేపురం డివిజన్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ బూత్‌స్థాయి నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. గత కొంతకాలంగా బీఆర్‌ఎస్‌లో ముందు నుంచి ఉన్న నాయకులు, కొత్త నాయకుల మధ్య వివాదం నడుస్తోంది. ఎన్నికల బూత్‌ల బాధ్యతలను ఎవరికి అప్పగించాలన్న చర్చ జరగడంతో పాత, కొత్త నాయకుల మధ్య వివాదం మొదలైంది. బూత్‌ల బాధ్యత మాకు కావాలంటే...కాదు మాకే కావాలని వాగ్వాదానికి దిగారు. మొదట చిన్నగా ప్రారంభమైన గొడవ చినికి చినికి గాలివానగా మారి నాయకులు కుర్చీలతో కొట్టుకునే వరకు వెళ్లింది. దీంతో రంగంలోకి దిగిన నియోజకవర్గ స్థాయి నాయకులు కొందరు వారిని మందలించి గొడవ సద్దుమణిగేలా చేశారు. రానున్న రోజుల్లో ఈగొడవ ఎక్కడి వరకు వెళ్తుందోనని పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ..

నేడు 'డయల్ యువర్ డీఎం'

నాగోలు: బండ్లగూడ ఆర్టీసీ డిపో నడిపే బస్సు సరీ్వసులపై ప్రయాణికుల అభిప్రాయాలు, సలహాలు, సూచనలు తెలుసుకొనేందుకు గురువారం(నేడు) డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎన్. రమేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రయాణికులు 9959224058 నంబర్‌కు కాల్ చేసి తమ సూచనలు, సలహాలు తెలియజేస్తే .. ఆర్టీసీ సేవలను మెరుగు పర్చేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

మధుయాష్కీ ఇంట్లో పోలీసుల సోదాలు

హయత్‌నగర్: హయత్‌నగర్‌లోని ఎల్‌బీనగర్ కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి సోదాల పేరిట పోలీసులు హైడ్రామాకు తెర తీశారు. డబ్బులు పంచుతున్నారనే సమాచారంతో అడిషనల్ డీసీపీ కోటేశ్వర్‌రావు, ఏసీపీ భీంరెడ్డిల ఆధ్వర్యంలో ఎస్‌ఓటీ పోలీసులు, ఈసీ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వినాయకనగర్‌లో మధుయాష్కీ గౌడ్ నివాసం ఉంటున్న ఇంట్లో సోదాలు చేశారు. ఈ సందర్భంగా మధుయాష్కీ, పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఎవరు ఫిర్యాదు చేశారు, వారెంట్ ఉందా అంటూ ప్రశ్నించారు. అధికార పార్టీకి అనుకూలంగా పని చేస్తున్నారంటూ వారిపై మండిపడ్డారు. ఇంతలో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకోవడంతో పోలీసులు, కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. మధుయాష్కీ ఇంటి యజమాని బీరువాను పోలీసులు తెరిచారు. అందులో రూ.5.5 లక్షలను గుర్తించారు. ఈ డబ్బులకు తగిన ఆధారాలు చూపించడంతో పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇలా ఉండగా, తమకు డయల్ 100 నుంచి డబ్బులు పంచుతున్నట్టు సమాచారం రావడంతో ఎన్నికల కమిషన్‌కు సమాచారం ఇచ్చి, వారి అనుమతితోనే సోదాలకు వెళ్లామని హయత్‌నగర్ సీఐ వెంకటేశ్వర్లు వివరణ ఇచ్చారు. తాము ఎవరికి అనుకూలంగా పని చేయమని ఎలక్షన్ కమిషన్ ఆధీనంలోనే పని చేస్తామన్నారు.

ఓటమి భయంతోనే దాడులు..

ఓటమి భయంతోనే బీఆర్‌ఎస్ నాయకులు తమ అధికారాన్ని అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ నాయకులపై దాడులకు తెగబడుతున్నారని మధుయాష్కీ గౌడ్ ఆరోపించారు. తన ఇంట్లో పోలీసులు సోదాలు నిర్వహించడంపై ఆయన స్పందిస్తూ .. స్థానిక ఎమ్మెల్యేకు ఓటమి భయం పట్టుకోవడంతో మమ్మల్ని, ఓటర్లను భయభ్రాంతులకు గురి చేయాలని చూస్తున్నారన్నారు. పోలీసుల వెంట మఫ్టీ పోలీసుల్లాగా బీఆర్‌ఎస్ కార్యకర్తలు వచ్చారని, తన ప్రచారాన్ని అడ్డుకోవడానికి స్థానిక ఎమ్మెల్యే ఇలాంటి కుట్రలు చేస్తున్నాడని ఆరోపించారు. ఎమ్మెల్యే రౌడీయిజానికి భయపడేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అడ్వకేట్ అసోసియేషన్ సభ్యులు వెంకటేష్‌యాదవ్, పీసీసీ కార్యదర్శి జయప్రకాష్, గజ్జి భాస్కర్‌యాదవ్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు సుజాతారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోంది. అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేసి ఓట్లు దండుకునే ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఓటర్లను ప్రభావితం చేసేలా మద్యం, వివిధ రకాల బహుమతులు ఇచ్చేందుకు అవకాశం ఉండటంతో ఎన్నికల సంఘం అలాంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే నియోజకవర్గం పరిధిలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఎలాంటి అనుమతులు లేకుండా నగదు తరలించే వారిని పట్టుకుంటున్నారు. అయినా డబ్బులు పంపిణీకి నూతన మార్గాలను ఎంచుకుంటున్నారు. బ్యాంకు ఖాతాలకు నగదును బదిలీ చేస్తే ఎలాంటి ఇబ్బందులు రాకుండా నగదును అందించవచ్చని భావిస్తున్నారు. దీంతో బ్యాంకుల ద్వారా అధిక మొత్తంలో జరిగే లావాదేవీలపై దృష్టి సారిస్తే అక్రమ నగదు పంపిణీపై మరింత దృష్టి సారించవచ్చనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం అధిక మొత్తంలో జరిగే లావాదేవీపై నిఘా ఏర్పాటు చేసింది.

మహిళా సంఘాల ఖాతాలపై నిఘా...

ఎన్నికల సంబంధించిన అంశంలో మహిళా ఓటర్లకు ఉన్నంత ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. మహిళా ఓటర్లను మచ్చిక చేసుకుని వారి కుటుంబీకుల ఓట్లను కూడా తమకు వేయించేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఈ సంఘాలతో అభ్యర్థులు తరపున నియమించిన ప్రత్యేక దూతలు సమావేశాలు నిర్వహించి తమ పార్టీలకే మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ఇలా వీరికి నగదు బదిలీ చేస్తే మిగతా సభ్యులకు కూడా పంపిణీ చేస్తారు. ఇలాంటి వాటిపై ఎన్నికల కమిషన్ నిఘా పెంచింది. బ్యాంకు ద్వారా వచ్చే రుణాలు కాకుండా ఇతర వ్యక్తులు సంస్థలు నుంచి స్వయం సహాయక సంఘాలకు డబ్బు జమ అవుతున్నదా?అనే వివరాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. అక్రమంగా జరిగే లావాదేవీలపై అధికారులు విచారణ జరిపి ఏదైనా అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే ఆ బ్యాంకు ఖాతా సీజ్ చేసేలా ఎన్నికల అధికారులు తీసుకున్నట్లు సమాచారం.

డిజిటల్ చెల్లింపులపై...

ఆన్డ్రాయిడ్ ఫోన్ అందుబాటులో ఉంటే గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం తదితర యాప్‌ల ద్వారా పెద్ద మొత్తంలో నగదు బదిలీ జరుగుతోంది. డిజిటల్ ఖాతాల ద్వారా లక్ష్యలో లావాదేవీలు జరిగితే సంబంధిత ఖాతాదారుల నుంచి వివరణ తీసుకునే అవకాశం ఉంది. పోటీ చేసే అభ్యర్థుల బంధువుల ఖాతా వివరాలను కూడా తీసుకునే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

పత్తికి ఎన్నికల గ్రహణం

- ప్రచారంలో కూలీలు
- చేలలోనే రాలిపోతున్న పత్తి
- పక్క రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకురావాల్సిన పరిస్థితి



యాచారం: పత్తి తీతకు అసెంబ్లీ ఎన్నికల గ్రహణం పట్టింది. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం కోసం పోటీలో నిలిచిన అభ్యర్థులు కూలీలను గుత్తగా మాట్లాడుకుంటున్నారు. వ్యవసాయ పనులతో పోలిస్తే ప్రచారంలో పాల్గొంటే ఎక్కువ డబ్బులు వస్తుండటంతో ప్రచారంలో కూలీలు తండోపతండాలుగా పాల్గొంటున్నారు. దీంతో పొలాల్లో పత్తి తీతకు కూలీల కొరత ఏర్పడింది. పత్తి తీతకు రండి కొంచెం ఎక్కువ కూలీ ఇస్తాం అని బతిమాలినా కూలీల నుంచి స్పందన రావడం లేదు. గ్రామాల్లో ఎన్నికల ప్రచారం సాగాలంటే అన్ని రాజకీయ పక్షాల పోటీ అభ్యర్థులు అత్యధికంగా మహిళలచే ర్యాలీలు, ఇంటింటికి వెళ్లి తమ గుర్తులపై ఓటర్లను కలిసేలా చూసుకుంటున్నారు. రంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా మాడ్గుల్, యాచారం, ఆమనగల్, తలకొండపల్లి, కడ్తాల్, కందుకూర్ తదితర మండలాల్లోని రైతులు లక్షన్నర ఎకరాలకు పైగా పత్తిసాగు చేశారు. ప్రస్తుతం పంటలో ఉన్న పత్తి తీతకు వచ్చింది. ఈ సమయంలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో మహిళా కూలీలు పత్తి తీతకు మొగ్గు చూపడం లేదు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారం రెండు, మూడు రోజులుగా గ్రామాల్లో జోరందుకుంది. ఆయా పార్టీల పోటీ అభ్యర్థులు ప్రతి గ్రామంలో 300–500 మందికి పైగా మహిళా కూలీలను ప్రచారానికి మాట్లాడుకుంటున్నారు. గ్రామాల్లో గంట, రెండు గంటలు తిరిగి ప్రచారం చేస్తే కూలీ గిట్టుబాటు కావడంతో పాటు మద్యం, బిర్యానీ అందుతుంది. దీంతో ఉదయం 8 గంటలకు వెళ్లి సాయంత్రం 6 గంటల వరకు పత్తి తీసే బదులు కొన్ని గంటలు మాత్రమే ప్రచారం చేస్తే అన్ని విధాలుగా లాభం ఉంటుందనే ఆశతో మహిళా కూలీలు పొలాల్లోకి వెళ్లడానికి సుముఖత చూపించడంలేదు. కూలీల కొరతతో రైతులు తల్లడిల్లిపోతున్నారు. పొలాల్లో పత్తి అలానే ఉండటం, వర్షాలు కురిస్తే చేతికందకుండా పోతుందనే భయం వారిని వెంటాడుతుంది.

రెండు–మూడు పార్టీల ప్రచారంలో..

గ్రామాల్లో ఎన్నికల ప్రచారం జోరందుకోవడంతో పేద కుటుంబాలకు చెందిన వారికి నిత్యం చేతినిండా డబ్బు అందుతుంది. నిత్యం రెక్కాడితే గాని డొక్కాడని పేదలు స్వగ్రామాల్లోనే రెండు, మూడు పార్టీల ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటూ నిత్యం రూ.వెయ్యికి పైగానే సంపాదిస్తున్నారు. డబ్బుతో పాటు మద్యం, బిర్యానీ ప్యాకెట్లు ఇవ్వడంతో అంతా అటువైపు మొగ్గు చూపిస్తున్నారు. ఇప్పటికే ప్రతి ప్రధాన పార్టీ అభ్యర్థి ప్రచారానికి రూ.లక్షల్లో ఖర్చు చేశారు. 3 వేలకు పైగా ఓట్లు ఉన్న గ్రామాల్లో వెయ్యికి పైగానే కూలీలు ప్రచారానికి వెళ్తున్నారు. ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి, మహేశ్వరం, చేవేళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల పరిధి అత్యధికంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉంది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు ఖర్చుకు వెనుకాడకుండా మహిళా కూలీలచే ప్రచారం చేయిస్తున్నారు.

అడ్వాన్స్‌లు ఇచ్చి మరీ..

కొన్ని గ్రామాల్లోనైతే ముందే అడ్వాన్స్‌లు ఇచ్చి ఈనెల 28వ తేది వరకు తమ పార్టీల గుర్తులపై ప్రచారం నిర్వహించాలని ఒప్పందాలు చేసుకున్నారు. ఒప్పందాల ప్రకారం రూ.కోట్లల్లో ఖర్చు చేస్తున్నారు. ఈజీగా డబ్బు వస్తుండటంతో కూలీలు పత్తి తీతకు ఆసక్తి చూపడం లేదు. యాచారం, మాడ్గుల్, కడ్తాల్, ఆమనగల్, తలకొండపల్లి మండలాల్లో వేలాది ఎకరాల్లో పత్తి తీయకపోవడంతో నేలరాలి పోతుంది. పత్తి ధర క్వింటాల్‌కు ప్రస్తుతం రూ.6వేలకు పైగానే డిమాండ్ ఉండటంతో పెట్టుబడులు పోను మంచి ఆదాయం పొందుతామనే కలలు కన్న రైతన్నలకు ఎన్నికల ప్రచార గ్రహణం కొలుకోలేని దెబ్బతీస్తుంది.

ఆంధ్రా నుంచి కూలీలు..

తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కూలీల కొరత ఉండటంతో స్థానిక రైతులు పక్క రాష్ట్రంలోని మాచర్ల, కర్నూల్, కనిగిరి తదితర ప్రాంతాల నుంచి కూలీలను రప్పించి పత్తి తీయించుకుంటున్నారు. పక్క రాష్ట్రం కూలీలు రూ.12కు కిలో పత్తిని తీస్తున్నారు. ఇలా నిత్యం ఆ రైతులు 500 కిలోలకు పైగానే పత్తిని తీస్తున్నారు. ఇలా మాడ్గుల్, యాచారం, కందుకూర్, ఆమనగల్, కడ్తాల్ తదితర మండలాల్లోని ఆయా గ్రామాల్లో వందలాది మంది ఆంధ్ర రాష్ట్రం నుంచి వచ్చిన కూలీలు పత్తిని తీస్తున్నారు. ఆంధ్ర రాష్ట్రం నుంచి వచ్చిన కూలీలకు స్థానిక రైతులు భోజనంతో పాటు వసతి సౌకర్యం ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక కూలీలు కూడ ప్రచారాలు లేని సమయంలో కిలోకు రూ.15 చొప్పున పత్తి తీసి రైతులకు సహకరిస్తున్నారు. అది కూడా పత్తి తీసిన వెంటనే డబ్బులిస్తేనే కూలీలు పత్తి తీతకు వెళ్తున్నారు. ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతన్నకు పంట చేతికొచ్చిన సమయంలో కూడా కూలీల కొరత కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది. అసెంబ్లీ ఎన్నికలు ముగిసే వరకు గ్రామాల్లో కూలీల కొరత రైతులను వేధించడం జరగక మానదు.

కూలీలు దొరకడంలేదు



రూ.10 లక్షల పెట్టుబడి పెట్టి 40 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను. స్థానికంగా పత్తి తీతకు కూలీల కొరత దృష్ట్యా ఆంధ్ర రాష్ట్రంలోని కర్నూల్ నుంచి 30 మంది కూలీలను రప్పించాం. కిలో పత్తి తీస్తే రూ.12 చెల్లిస్తున్నాం. భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నాం. ప్రస్తుతం పత్తి అంతా తీతకు వచ్చింది. వర్షాలు కురిస్తే తడిసి పోతుందనే భయమేస్తోంది. ఎన్నికలు ముగిసేవరకు కూలీల ఇబ్బంది తప్పదు.

– రామచంద్రమ్మ, రైతు, మాడ్గుల్